వైద్యుల నిరసన ప్రదర్శన



నెల్లూరు(వీఆర్సీసెంటర్): డాక్టర్ పల్లంరెడ్డి యశోధర ఆధ్వర్యంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, మెడికల్ రెప్స్, నారాయణ, ప్రభుత్వ వైద్య కళాశాలల విద్యార్థులు బుధవారం సాయంత్రం నెల్లూరులో నిరసన ప్రదర్శన చేపట్టారు. కోల్‌కతాలోని ఆర్జీకార్ వైద్య కళాశాలలో పీజీ చేస్తున్న విద్యార్థినిపై లైంగికదాడి చేసి, హత్య చేసిన ఘటనను నిరసిస్తూ వీఆర్సీ సెంటర్ నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ చేశారు.

ఉత్సాహంగా 'హర్ ఘర్ తిరంగా'

నెల్లూరు (టౌన్) : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక భక్తవత్సలనగర్‌లోని కేఏన్నార్ మున్సిపల్ హైస్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్లు చేపట్టిన హర్‌ఘర్ తిరంగా ర్యాలీ ఉత్సాహంగా సాగింది. తొలుత పాఠశాల హెచ్‌ఎం విజయప్రకాష్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. స్థానిక వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. అనంతరం ఆయన విగ్రహానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ సెకండ్ ఆఫీజర్ నరేంద్రబాబు, ఎన్‌సీసీ పీఐ స్టాఫ్ బాదల్, క్యాడెట్లు పాల్గొన్నారు.


నెల్లూరు (టౌన్) : పటేల్ విగ్రహం వద్ద..


రంగనాయికులపేటలో..

• నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : స్వాతంత్ర్య వేడుకలను సగర్వంగా జరుపుకోవాలని సీడీపీఓ ఎం.అన్నపూర్ణ అన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని తూకుమానుమిట్ట అంగన్‌వాడీ పరిధి రంగనాయకులపేట సెక్టారులో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ చేశారు. సూపర్‌వైజర్ వి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

కార్గో ఆదాయం పెంచండి

నెల్లూరు సిటీ: ఏపీఎస్‌ఆర్టీసీ కార్గో ఆదాయం పెంచాలని ఉద్యోగులకు ఆర్టీసీ ఈడీ ఆదాం సాహెబ్ సూచించారు. నగరంలోని ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం కార్గో కార్యాలయంలో అదనపు గదిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో పార్సిల్స్‌ను భద్రపరిచేందుకు ప్రత్యేకంగా గదిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఎం విజయరత్నం, డీఎం-1 మురళీకృష్ణ, డిప్యూటీ సీటీఎం ఇబ్రహీం పాల్గొన్నారు.


అదనపు గదిని ప్రారంభించిన అధికారులు

యువకుడి దారుణ హత్య


ఘటనా స్థలంలో వేణు

నెల్లూరు(క్రైమ్) : గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన బుధవారం రాత్రి కరెంటాఫీస్(బీవీనగర్) రైల్వే గేటు సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. కావలికి చెందిన ఏడుకొండలు కుమారుడు ఎం.వేణు(23) చిన్నతనం నుంచే నెల్లూరు బీవీనగర్‌లోని తన అమ్మమ్మ హాజరత్తమ్మ ఇంట్లో ఉంటూ బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏం జరిగిందో తెలియదు గానీ బుధవారం రాత్రి కరెంటాఫీస్ రైల్వేగేటు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు అతన్ని కిరాతకంగా హత్య చేసి వెళ్లిపోయారు. ఈ క్రమంలో అటుగా వెళ్తున్న వారు రక్తపుమడుగులో ఉన్న వేణును గుర్తించి వేదాయపాళెం పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ టీవీ సుబ్బారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. హత్యకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పోలీసులకు అవార్డులు

నెల్లూరు(క్రైమ్): విధి నిర్వహణలో విశిష్ట సేవలందించిన పోలీస్ అధికారులు, సిబ్బందికి అవార్డులు వరించాయి. ఏఎస్పీలు డి.హిమవతి, ఏవీఆర్‌పీబీ ప్రసాద్, జి.శ్రీనివాసరావు, నెల్లూరు, కావలి, ఆత్మకూరు, కందుకూరు, మహిళా డీఎస్పీలు డి.శ్రీనివాసరెడ్డి, ఎం.వెంకటరమణ, ఎన్.కోటారెడ్డి, ఎ.శ్రీనివాస్, టి.సాయినాథ్, ఇన్‌స్పెక్టర్‌లు టీవీ సుబ్బారావు, ఎం.నాగేశ్వరమ్మ, ఎన్.రామారావు, కె.శ్రీనివాసరావు, సీహెచ్ కోటేశ్వరరావు, ఎం.హైమారావు, ఆర్‌ఐలు కె.అంకమరావు, జి.హరిబాబు, జె.రామారావు, ఎస్సైలు ఎ.సైదులు, కె.ఇంద్రసేనారెడ్డి, కె.నరేష్, కె.గీతారమ్య, ఎస్.క్రాంతికుమార్, ఎ.సురేష్‌బాబు, జి.సుబ్బారావు, జి.వెంకటేశ్వరరెడ్డి, ఆర్‌ఎస్‌ఐ ఎం.హరికృష్ణతోపాటు 24 మంది సిబ్బంది, ఏపీ స్టార్స్‌లో డిప్యూటీ సూపరింటెండెంట్ ఏబీ కాంతరాజు, డిప్యూటీ జైలర్ జి.అరుణకుమార్ ఇంకా సీఐడీలో నలుగురు, ఇంటెలిజెన్స్‌లో నలుగురు, కేంద్ర కారాగారంలో ముగ్గురు, అగ్నిమాపక శాఖలో ఐదుగురు, ఎక్సైజ్‌లో ముగ్గురు, ఐఎంఎల్ డిపోలో ముగ్గురు సిబ్బంది గురువారం పోలీసు కవాతు మైదానంలో అవార్డులు అందుకోనున్నారు.

మెరుగైన శాంతిభద్రతలు అందిస్తా



శ్రీనివాసరావు

నెల్లూరు(క్రైమ్): నేరాలను కట్టడి చేసి ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలను అందిస్తానని సంతపేట నూతన ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటామన్నారు. ఉన్నతాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ నేరనియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆయన ఎస్పీ జి.కృష్ణకాంత్, నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీనివాసరావు 1996లో పోలీసు శాఖలో ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. గతంలో నెల్లూరు వన్‌టౌన్ (నేటి చిన్నబజారు) పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా, వెంకటగిరి సీఐగా, ఒంగోలు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సీఐడీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు.

టీచర్ల సర్దుబాటుపై డీఈఓకు వినతి

నెల్లూరు(టౌన్):బీటీఏ నాయకులు జిల్లా విద్యాశాఖాధికారి రామారావును నెల్లూరులోని డీఈఓ కార్యాలయంలో బుధవారం కలిశారు. కార్పొరేషన్ పరిధిలోని టీచర్లను ఒక యూనిట్‌గా తీసుకుని సర్దుబాటు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. వినతి పత్రం సమర్పించారు. తొలుత బీటీఏ కార్యాలయంలో నెల్లూరు నగర శాఖ సబ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పల్లం వేణుగోపాల్, కార్యదర్శులు భాస్కరయ్య, తిరుపతయ్య పాల్గొన్నారు. వ్యతిరేక కార్యకలాపాలు చేయడంతో కోలా కిరణ్‌కుమార్‌ను సంఘం నుంచి తొలగించినట్లు చెప్పారు. బీటీఏ నగర అధ్యక్షుడిగా పెంచల ప్రసాద్‌ను నియమించినట్లు పేర్కొన్నారు.

నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.100
సన్నవి	: రూ.50
పండ్లు	: రూ.40

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 107
లేయర్ (లైవ్)	: 95
బ్రాయిలర్ చికెన్	: 204
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 224
లేయర్ చికెన్	: 161

సీనియర్ విద్యార్థిపై జూనియర్ల దాడి

నెల్లూరు(క్రైమ్) : మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదన్న అక్కసుతో సీనియర్ విద్యార్థిపై జూనియర్ విద్యార్థులు దాడిచేసిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. బుచ్చిరెడ్డిపాళెం దామరమడుగుకు చెందిన షేక్.అష్రఫ్‌బాషా నెల్లూరు నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నారు. ఆరు నెలలుగా అతను కళాశాలకు వెళ్లకుండా రామ్‌జీనగర్‌లోని రిలయన్స్‌స్మార్ట్‌లో పనిచేస్తున్నాడు. ఈనెల 12వ తేదీ అతను స్నేహితుడిని కలిసేందుకు నారాయణ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలోని టీ కేఫ్ వద్దకు వెళ్లాడు. అదే కళాశాలలో జూనియర్ విద్యార్థులైన కైఫ్, మన్సూర్, ముజమిల్, షాహుల్ కేఫ్ వద్దకు వచ్చారు. మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని వారు అష్రఫ్‌బాషాను అడిగారు. డబ్బులు లేదని చెప్పడంతో ఇటుక రాయితో అతనిపై దాడిచేశారు. గాయాలపాలైన అష్రఫ్‌బాషా జీజీహెచ్‌లో చికిత్స తీసుకుని బుధవారం బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): పాతకక్షల నేపథ్యంలో యువకుడిపై కొందరు హత్యాయత్నం చేసిన ఘటనపై నెల్లూరు చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. హరనాథపురం సర్వేపల్లి కాలువకట్టకు చెందిన శ్రీనివాసులు పెయింట్ పనిచేస్తుంటాడు. అతడికి అదే ప్రాంతానికి చెందిన నితిన్, కిరణ్, తేజ స్నేహితులు. మూడునెలల క్రితం వారి మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. అప్పటి నుంచి వారు శ్రీనివాసులుపై కక్ష తీర్చుకోవాలని సమయం కోసం వేచి చూడసాగారు. ఈనెల 13వ తేదీ అర్ధరాత్రి పనికి ఎందుకు వెళ్లడం లేదని శ్రీనివాసులును తల్లి మందలించడంతో మనస్తాపానికి లోనై బ్లేడ్‌తో కుడి చేతిపై కోసుకోవడంతో రక్తస్రావమైంది. దీంతో కుటుంబసభ్యులు అతడిని చికిత్స నిమిత్తం జయభారత్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. చికిత్స అనంతరం ఇంటికి బయలుదేరారు. దారిలో నితిన్, కిరణ్, తేజ, సాయి మోటార్‌బైక్‌లపై వచ్చి ఆటోను అడ్డగించారు. మాట్లాడాలంటూ శ్రీనివాసులును కిందకు దించి బీరు బాటిళ్లతో విచక్షణారహితంగా దాడి చేశారు. బాధితుడి తమ్ముడు ముఖేష్‌బాబు, మరో వ్యక్తి అడ్డుకోవడంతో నిందితులు పరారయ్యారు. తీవ్రగాయాలతో శ్రీనివాసులు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు ముఖేష్‌బాబు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు బుధవారం ఉదయం హాస్పిటల్‌కు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.

ఏర్పాట్ల పరిశీలన


సూచనలిస్తున్న జేసీ

నెల్లూరు(దర్గామిట్ట): నగరంలోని పోలీసు కవాతు మైదానంలో గురువారం జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను బుధవారం జేసీ కార్తీక్ పరిశీలించారు. అధికారులకు సూచనలిచ్చారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ జాతీయ జెండా ఎగురవేసి గౌరవ వందనం స్వీకరిస్తారు. తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ప్రాథమిక చికిత్స కిట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. జేసీ వెంట డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, ఆర్డీఓ మలోల ఉన్నారు.

రాజరాజేశ్వరి సేవలో..

నెల్లూరు(బృందావనం) : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారిని భారత ప్రభుత్వ విద్యామంత్రిత్వశాఖ ప్రాంతీయ సలహా కమిటీ చైర్మన్ రాజేష్‌శర్మ బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు దేవస్థానం ఈఓ వెంకటసుబ్బయ్య అమ్మవారి దర్శనం కల్పించారు.

అసిస్టెంట్ లైన్‌మెన్‌పై దాడి

నెల్లూరు(క్రైమ్) : కరెంట్ బిల్లు చెల్లించకపోవడంతో సర్వీసువైర్‌ను కట్ చేసిన అసిస్టెంట్ లైన్‌మెన్‌పై తండ్రీకొడుకు దాడిచేసిన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కె.రాజేష్ పడారుపల్లిలో అసిస్టెంట్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పడారుపల్లికి చెందిన రామచంద్రయ్య కరెంట్ బిల్లు కట్టకపోవడంతో మంగళవారం రాజేష్ వారి ఇంటి విద్యుత్ సర్వీస్‌వైర్‌ను కట్‌చేశారు. దీంతో కోపోద్రిక్తుడైన రామచంద్రయ్య, అతని కుమారుడు మనోహర్ అసిస్టెంట్ లైన్‌మెన్‌పై దాడిచేశారు. ఈ మేరకు బాధితుడు బుధవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ టీవీ సుబ్బారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే కక్ష సాధింపు

నెల్లూరు(బారకాసు): నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకుడిపై రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కక్ష సాధింపు చర్యకు తెరలేపారు. నగర పాలక సంస్థ పరిధిలో ఎన్నో వాటర్ ప్లాంట్లు ఉన్నప్పటికీ 19వ డివిజన్‌లో ఉన్న వాటర్ ప్లాంట్ వైఎస్సార్‌సీపీకి చెందిన వ్యక్తిదన్న కారణంగా బుధవారం ఆ వాటర్ ప్లాంట్‌ను అధికారుల ద్వారా సీజ్ చేయించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

HAPPY INDEPENDENCE DAY

మర్యాదపూర్వకంగా..

నెల్లూరు(దర్గామిట్ట) : మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆయన నివాసంలో సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించుకున్నారు.

పర్వతరెడ్డి భేటీ

మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులోని కాకాణి నివాసంలో కలిసి పలు విషయాలపై చర్చించారు.



మంత్రి కాకాణితో ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

స్వాతంత్య్ర వీరులకు కళానివాళి





నెల్లూరు(బృందావనం) : దేశ స్వాతంత్య్రం కోసం పోరాటం చేసిన త్యాగమూర్తులను స్మరిస్తూ నెల్లూరుకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థిని నల్లంగు ఉజ్వలఖ్యాతి వినూత్నంగా, కళాత్మకంగా నివాళి అర్పించారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రావి ఆకు కొమ్మలను సేకరించి రావిచెట్టులా తీర్చిదిద్ది అందులోని ఆకులు, కొమ్మలపై గాంధీ, భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు, చంద్రశేఖర్‌ఆజాద్ ఇలా 77 మంది చిత్రాలను వాటర్‌కలర్స్, పెయింటింగ్‌లతో సృజనాత్మకంగా తీర్చిదిద్దారు.

పొగాకు ఉత్పత్తులతో అనర్థాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : పొగాకు ఉత్పత్తులను వినియోగించడం వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య అన్నారు. నగరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్‌కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర లీగల్ కన్సల్టెంట్ శివకుమార్‌తో బుధవారం సమావేశం నిర్వహించారు. సీఓటీపీఏ–2023 చట్టాలను అన్ని శాఖలు పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హైకోర్టు అడ్వొకేట్ ప్రదీప్ పాల్గొన్నారు.

కొత్త కమిటీ ఎన్నికకు తరలిరండి

నెల్లూరు(బారకాసు) : స్టోన్‌హౌస్‌పేటలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ పరిరక్షణ కోసం కొత్త కమిటీని ఎన్నుకునేందుకు ఆలయ జీవితకాల సభ్యులు తరలిరావాలని ఆలయ ధర్మపోరాట కమిటీ కన్వీనర్ తన్నీరు వెంకటసుబ్బారావు పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఈనెల 18న ఆదివారం ఉదయం 10.30 గంటలకు దేవస్థానంలో జరిగే సర్వసభ్య సమావేశంలో ఏకాభిప్రాయానికి వచ్చి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడమో.. లేదా ఎన్నికలు నిర్వహించి కమిటీని ఎన్నుకోవడం జరిగేలా చూడాల్సిన బాధ్యత జీవితకాల సభ్యులపై ఉందన్నారు.